గురువారం 30.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ ఉద్యోగం కూడా ఇవ్వని వైసీపీకి, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. అసూయ, ఈర్ష్య ద్వేషంతోనే వైసీపీ మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేస్తోంది.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

సంపుటి - 34 సంచిక - 99 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# జాబ్ క్యాలెండర్‌కు గ్రీన్ సిగ్నల్




- రెండో దశలో 3,168 పోస్టుల భర్తీ
- సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల
- జాబ్ కేలండర్-2026పై సమీక్షలో మంత్రుల బృందం దిశానిర్దేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. జాబ్ కేలండర్-2026పై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లి నివాసంలో సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి మంత్రులు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో భర్తీ చేయాల్సిన పోస్టుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జాబ్ కేలండర్-26లో విడుదల చేసిన 10,060 ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే మొదటి దశ కింద వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15న నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టుల భర్తీకి ఆగస్టు 15 నోటిఫికేషన్ విడుదల చేయాలని మొదట నిర్ణయించినప్పటికీ.. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో వివిధ సాంకేతిక కారణాలు, ఉద్యోగ సంఘాల వినతి మేరకు జాప్యం జరిగింది. దీంతో సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**అక్టోబర్ 15న 3,4 దశల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ :** జాబ్ కేలండర్ లో భాగంగా ఒకేసారి మూడు, నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 15న నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. మూడో దశలో 2,388, నాలుగో దశలో 2,981 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ విభాగాల్లోని ఖాళీలను డిపార్ట్ మెంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తీ చేయాలని సీఎం గారు నిర్దేశించారని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలోని 2,388 ఉద్యోగాల్లో 2,225 పోస్టులు హోంశాఖలో భర్తీ చేయనున్నారు. గ్రూప్-1లో ఇప్పటికే సూచించిన ఉద్యోగాల కంటే మరికొన్ని ఉద్యోగాలు పెంచాల్సిన అవశ్యకత ఉందని మంత్రుల బృందం అభిప్రాయపడింది. మొత్తంగా 10,060 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సకాలంలో పోస్టులు భర్తీ చేసి ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 పూర్తి ఖాళీల వివరాలను ఆరో తేదీన జరిగే కేబినెట్ ముందు ప్రవేశపెట్టనున్నారు.

ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రవి సుభాష్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు.



# సెమీకండక్టర్లకు ఏపీ హబ్



- తైవాన్ కంపెనీలతో పెట్టుబడులు, తయారీపై చర్చలు
- నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక భాగస్వామ్యంపై దృష్టి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కనస్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. మిగతా 2లో...




# 13 వేల మందితో మహా థింసా

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సర్వం సిద్ధం
- 30 వేల మొక్కలతో 'WELCOME PM MODI JI, CM CBN JI'..

**విజయనగరం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానాశ్రయాన్ని ప్రారంభించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసింది.

ప్రధానికి వినూత్న స్వాగతం పలికేందుకు భోగాపురం వాసులు 30 వేల మొక్కలతో "WELCOME PM MODI JI, CM CBN JI" అనే భారీ సందేశాన్ని రూపొందించారు. ప్రధాని విమానం ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో ఆకాశం నుంచే స్పష్టంగా కనిపించేలా దీనిని తీర్చిదిద్దారు. ఈ ఏర్పాట్ల కోసం సుమారు 70 మంది వారం రోజుల పాటు శ్రమించారు. సన్‌రే రిసార్ట్స్ అధినేత రాజాబాబు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ మొక్కల ఏర్పాటులో జపాన్ నుంచి దిగుమతి చేసిన బర్నింగ్ బుష్ గడ్డి మిగతా 2లో...

# మనిషి-ఏనుగు మధ్య సామరస్యం



- గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ప్రజలకు అంకితం
- సహజీవనమే ప్రభుత్వ లక్ష్యమన్న పవన్ కళ్యాణ్

**పార్వతీపురం (జర్నలిస్ట్ ఫైల్) :** "ప్రకృతి మనకు చెందినది కాదు... మనమే ప్రకృతికి చెందినవాళ్లం. అందుకే ప్రకృతితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల భద్రతతో పాటు వన్యప్రాణుల సంరక్షణపైనా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అదే దృక్పథంతో మానవ-ఏనుగు సంఘర్షణలను తగ్గించడానికి గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేశాం" అని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని పవన్ కళ్యాణ్ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు.

అడవి ఏనుగుల సంచారాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం, దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవ-ఏనుగు సంఘర్షణను నివారించడమే ఈ శిబిరం ప్రధాన మిగతా 2లో...



# రైతుకు బీమా భరోసా



- జూలై 31తో గడువు ముగింపు
- వెంటనే నమోదు చేసుకోవాలని రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా నమోదును జూలై 31వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వరదలు, కరువు వంటి అనూహ్య పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతు కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచేది పంటల బీమా మాత్రమేనని ఆయన అన్నారు. 2లో...

# పేపర్ లీక్‌లకు ఉక్కుపాదం

- లోక్‌సభలో 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' ఆమోదం
- నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు, భారీ జరిమానాలు



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' విపక్షాల గందరగోళం నడుమ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. బిల్లు ఆమోదం అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ కేసులో కేంద్ర ప్రభుత్వం ఎంతో వేగంగా స్పందించి చర్యలు తీసుకుందని సభకు తెలిపారు. 2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని మంత్రి అధికారిక గణాంకాలను సభలో వెల్లడించారు.

అయితే, అంతకు ముందుకు తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామ్స్ చట్టం' కఠినంగా అమలు కావడం వల్ల గత కొన్ని ఏళ్లుగా పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు చేసుకునే ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఇది చట్టం సాధించిన సానుకూల ప్రభావానికి నిదర్శనమని మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. విపక్షనేత రాహుల్ గాంధీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో విపక్షాల నిరసనలు మిన్నంటినప్పటికీ బిల్లు ఆమోదం పొందింది. అనంతరం స్పీకర్ లోక్‌సభను తదుపరి రోజుకు వాయిదా వేశారు. అంతకు మందుకు సభలో 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' సభలో వాడీవేడిగా చర్చ జరిగింది. చట్టాలను పెంచడం మాత్రమే సరిపోదని, మిగతా 2లో...

# బౌద్ధ వారసత్వానికి ప్రాధాన్యం



- రాష్ట్రంలో బౌద్ధ పర్యాటకాభివృద్ధికి చర్యలు
- మైత్రేయ బుద్ధ విహార్‌ను విశ్వవ్యాప్తం చేస్తామని మంత్రి దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బౌద్ధ క్షేత్రాల సమగ్ర అభివృద్ధికి, 'బుద్ధిస్ట్ సర్క్యూట్' ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మిగతా 2లో...

# భోగాపురం ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు



- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- సభను విజయవంతం చేయాలని మంత్రుల పిలుపు

**విజయనగరం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభం కానుండగా, ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉత్తరాంధ్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రారంభోత్సవ సభకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది హాజరవుతారని మంత్రులు తెలిపారు. భారీ జనసమీకరణ దృష్ట్యా భద్రత, రవాణా, ఇతర ఏర్పాట్లపై అధికార యంత్రాంగంతో పాటు పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు వివిధ నియోజకవర్గాల్లో పర్యటించి స్థానిక నాయకులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు.

భోగాపురం విమానాశ్రయ ఏర్పాటులో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు కీలక పాత్ర పోషించారని మంత్రి నారాయణ తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్టుకు బాటలు పడ్డాయని గుర్తు చేస్తూ, ప్రారంభోత్సవానికి మిగతా 2లో...

## సెమీకండక్టర్లకు ఏపీ హబ్



(మొదటి పేజీ తరువాయి)

ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

**ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు :** అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో తైవాన్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగ-సన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్- ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

## 13 వేల మందితో మహా థింసా




(మొదటి పేజీ తరువాయి)

మొక్కలను వినియోగించినట్లు రాజాబాబు తెలిపారు. అక్షరాలు స్పష్టంగా కనిపించేలా వాటి చుట్టూ ముదురు రంగు మొక్కలను నాటినట్లు చెప్పారు. ప్రకృతి సౌందర్యంతో కూడిన ఈ వినూత్న స్వాగతం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 30 సెకన్ల రీల్స్ పోటీలు నిర్వహిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ విశిష్టతను ప్రతిబింబించే రీల్స్‌ను ఈ నెల 29లోపు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని సూచించింది.

అదేవిధంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంపై ఆకర్షణీయమైన తెలుగు స్లోగన్ రూపొందించిన వారికి రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ప్రకటించారు. ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ఘన స్వాగతం పలికేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా అరకు ప్రాంతానికి చెందిన సంప్రదాయ థింసా నృత్యాన్ని భారీ స్థాయిలో ప్రదర్శించనున్నారు. సుమారు 13 వేల మంది గిరిజన బాలికలు, మహిళలు పాల్గొనే మహా థింసా నృత్యం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రధాని విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే ఈ సాంప్రదాయ నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు.

# మనిషి-ఏనుగు మధ్య సామరస్యం



(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా పనిచేయనుంది.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించడం, రైతుల పంటలను ధ్వంసం చేయడం, ప్రజలు రాత్రివేళ భయాందోళనల మధ్య జీవించడం వంటి సమస్యలు పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్ర పర్యటన సందర్భంగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, స్థానిక ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో మానవ--ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు.

**అదే విజయం ఇక్కడా సాధించాలి :** గతంలో పలమనేరు ప్రాంతంలో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్లలో కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుతో పాటు అటవీశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పనిచేశారని తెలిపారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో మానవ--ఏనుగు సంఘర్షణల కారణంగా సంభవించే మరణాలను 70 శాతానికి పైగా తగ్గించడంతో పాటు పంట నష్టాలను కూడా గణనీయంగా తగ్గించగలిగారని చెప్పారు. అదే విజయాన్ని ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య సహజీవనానికి వేదికగా గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలవాలని ఆకాంక్షిస్తూ దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

**కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు :** పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించగలిగినందుకు ప్రధాన కారణం కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారమేనని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర విజ్ఞప్తిని గౌరవించి నాలుగు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు పంపించడం వారి స్నేహభావానికి నిదర్శనమన్నారు. ఏనుగులను ఇవ్వడం సంపదను పంచుకున్నట్లుగా భావించే సంప్రదాయం ఉన్నప్పటికీ, తెలుగు ప్రజల రక్షణ కోసం కుంకీ ఏనుగులను పంపించిన కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అప్పటి అటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి సహకారం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, శాసనసభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఎన్. నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నందిని సలారియా, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, జిల్లా అటవీ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు బీమా భరోసా




(మొదటి పేజీ తరువాయి)

ఖరీఫ్ పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున ఒక్క రైతు కూడా ఈ అవకాశాన్ని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. రైతులు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. గడువు ముగిసిన అనంతరం నమోదు అవకాశం ఉండకపోవచ్చని, అందువల్ల ప్రతి రైతు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పంట సాగు కోసం రైతు ఏడాది పొడవునా పడే శ్రమకు భద్రత కల్పించే ముఖ్యమైన సాధనం పంటల బీమా అని పేర్కొన్నారు.

రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం పంటల బీమా నమోదును సులభతరం చేసిందని మంత్రి తెలిపారు. PMFBY Crop Insurance Farmer App ద్వారా రైతులు స్వయంగా బీమా నమోదు చేసుకోవచ్చని, అలాగే కామన్ సర్వీస్ సెంటర్లు, సంబంధిత బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రామ, మండల వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో కూడా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని వివరించారు. బీమా నమోదు సమయంలో అవసరమైన పత్రాలు, భూమి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర సమాచారాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత రసీదు లేదా ధ్రువీకరణ వివరాలను తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి అర్హ రైతు పంటల బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

రైతు ఏడాది శ్రమను కాపాడేది పంటల బీమా. కాబట్టి జూలై 31 గడువు ముగిసేలోపు ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకుని తమ పంటలకు పూర్తి భద్రత కల్పించుకోవాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోసారి విజ్ఞప్తి చేశారు.

# భోగాపురం ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విమానాశ్రయ నిర్మాణ పనులు నిర్లక్ష్యానికి గురై నత్తనడకన సాగాయని మంత్రులు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు వేగవంతమై, నిర్ణీత గడువులో పూర్తి అయ్యాయని పేర్కొన్నారు.

విజయనగరం నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నారాయణ తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి రూ.36 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ పనులతో నగర మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. లో-వోల్టేజీ, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విజయనగరం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ, జిల్లాకు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మంత్రులు పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పేపర్ లీక్‌లకు ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది జవాబుదారీతనం పెంచాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. అందుకు అధికార పక్షం స్పందిస్తూ.. బిల్లులో తాజా సవరణలు పరీక్షా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయని బదులిచ్చారు.

**ఇక నిందితులకు కఠిన జైలు శిక్ష.. :** ఇక నుంచి పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యక్తులు, గ్యాంగ్‌లు, అధికారులకు విధించే కనీస జైలు శిక్షను 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా బిల్లును రూపొందించారు. పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీలు, సంస్థలు, ముఠాలకు రూ.5 కోట్ల వరకు భారీ జరిమానా విధించడంతో పాటు, ఆ పరీక్ష నిర్వహణకు అయిన మొత్తం వ్యయాన్ని వారి నుంచే వసూలు చేయనున్నారు. పేపర్ లీక్ కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఈ కేసుల విచారణను 2 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి కొత్తగా ఏర్పాటు చేసే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో రోజువారీ ప్రాతిపదికన విచారణ జరుగుతుంది.

అదేవిధంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి జరిగే పెద్ద ఎత్తున పరీక్షల మోసాలను విచారించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. అక్రమాలకు బాధ్యులైన పరీక్షా నిర్వహణ ఏజెన్సీలపై నిషేధ కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచారు. ఇటీవల నీట్ వంటి పోటీ పరీక్షల్లో చోటుచేసుకున్న వివాదాలు, దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో కేంద్రం ఈ చట్టాన్ని బలపరిచింది. విద్యార్థుల భవిష్యత్తును, విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఇదొక కీలక అడుగు అని ప్రభుత్వం పేర్కొనగా, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనంపై లోక్‌సభలో ఇవాళ విస్తృతంగా చర్చ జరిగిన విషయం తెలిసిందే.

## బౌద్ధ వారసత్వానికి ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మించిన 'మైత్రేయ బుద్ధ విహార్' ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని గౌతమ బుద్ధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ దమ్మ పీఠాధిపతి బంతె అనాలయో, శ్రీలంక నుంచి విచ్చేసిన డాక్టర్ బోధగామ చండిమా నాయకే థీరోల ఆశీస్సులు స్వీకరించిన మంత్రి దుర్గేష్ పలు దేశాల నుంచి విచ్చేసిన బౌద్ధ ప్రతినిధులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..బుద్ధుడు సంచరించిన పవిత్ర ప్రాంతంగా నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరానికి గుర్తింపు ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో పర్యాటక శాఖను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, యువత మరియు విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించేలా ఈ విహార్ తోడ్పడాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. మైత్రేయ బుద్ధ విహార్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా, విశ్వవ్యాప్తం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉత్తర భారతదేశం తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని తొట్లకొండ, బావికొండ, ఆదుర్రు, ఉండ్రాజవరం, అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల వంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను అనుసంధానిస్తూ త్వరలోనే బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతి, సహనం, అహింస అనేవి ఏ కాలానికైనా ఆచరణీయమైనవని, ద్వేషాన్ని ప్రేమతోనే జయించగలమన్న బుద్ధుని సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి ఎందరో మహనీయులు కూడా ఈ మార్గాన్ని అనుసరించారని గుర్తుచేశారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో ప్రధాని పర్యటన ఉండటంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు రాలేకపోయారని స్పష్టం చేశారు.

## గడప గడపలో ఆశీర్వాదం



- **ఉత్సాహంగా 'మన ఇంటికి -మన నసీర్'**
- **అభివృద్ధి, సంక్షేమం వివరిస్తూ ముందుకు కదిలిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):**గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. బుధవారం స్థానిక కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో మన ఇంటికి- మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ ప్రజలతో మమేకమవుతూ ప్రజలు ముందుకు కదిలారు. లీడర్ నుంచి కేడర్ వరకు కార్యక్రమం వెంట నడిచారు. తమ గుమ్మం వద్దకే కదిలివచ్చిన నాయకులకు ప్రజలకు హృదయపూర్వంగా అపూర్వ స్వాగతం పలికారు. ప్రజలను నాయకులు ఆప్యాయంగా పలకరిస్తూ రెండేళ్లలో అందించి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మారిన కాలనీలు, అభివృద్ధిపథంలో ముందడుగు వేసిన ప్రాంతాల గురించి చర్చించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం వెన్నంటి నిలుస్తుందనే భరోసా కల్పించారు. ఇది కేవలం ప్రచారమే కాదని, ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిలువెత్తు నిదర్శమని చెప్పారు. రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ ఎన్నికల్లో ఎన్నడూలేని విధంగా ప్రజల ఆశీర్వాదం తో 151 సీట్లు తో గెలిపించారని, ప్రజల రుణం తీర్చుకుంటున్నామని అన్నారు. సూపర్‌సిక్స్ ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామన్నారు. సమాజంలో ఇప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధ్వంసకర శక్తులు ఉన్నాయని, అందుకే ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు నేరుగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్, ప్రతి గడపకు చేరుకుని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నట్లు తెలిపారు. సంక్షేమ రంగంలో తల్లికి వందనం, సీఎం రిలీఫ్ ఫండ్, ఉచిత వైద్య శిబిరాలు తదితర పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు, సూరె శ్రీను, మల్లెంపూడి శ్రీను, గోనినేని హరికృష్ణ, సూరం లక్ష్మి, యార్ల గురవయ్య, పాటిబండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సాధికారతే లక్ష్యం

- **విద్య, ఉద్యోగాల కోసం ప్రణాళికాబద్ధంగా కూటమి చర్యలు**
- **సీఈడీఎం-ఏపీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలోని మైనారిటీ కుటుంబాల్లో నిరక్షరాస్యత తగ్గించి, ఉన్నత విద్య, ఉద్యోగ,ఉపాధి కల్పన కోసం కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళికా బద్ధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం మంగళగిరి లోని వడ్డేశ్వరంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సి.ఈ.డి.ఎం)- ఏపీ ప్రధాన కార్యాలయ నూతన ప్రాంగణాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్,వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాషా, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ భాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ అధ్యక్షతన,సి.ఈ.డి.ఎం డైరెక్టర్ యాకుబ్ భాషా పర్యవేక్షణలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఫరూక్ ప్రసంగించారు. జస్టిస్ సచార్ నివేదిక ప్రకారం మైనారిటీలు, అందులో ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా దళితుల కంటే వెనుకబడి ఉన్నారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇందుకు ముఖ్యంగా నిరక్షరాస్యత, నిరుద్యోగం ప్రధాన కారణాలుగా ఉన్నాయని , ఈ రెండింటిని అధిగమించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రణాళికత తో కూడిన, వివిధ మార్గాల ద్వారా చర్యలను అమలు చేయడం జరుగుతున్నదన్నారు. మైనారిటీలలో నిరక్షరాస్యతకు అడ్డుకట్ట వేయడం, అక్షరాస్యత పెంపొందించి ఉన్నత విద్య, ఉద్యోగ ఉపాధి కల్పన కల్పించడం ద్వారా మైనారిటీల సాధికారత లక్ష్యం నెరవేరుతుందని మంత్రి ఫరూక్ అన్నారు.

మైనారిటీల అభివృద్ధికి తీవ్ర అవరోధాలుగా ఉన్న వాటిని అధిగమించేందుకు విద్య, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం సి.ఈ.డి.ఎం ఏర్పాటు చేయడం జరిగిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. యువతకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు, వివిధ ప్రొఫెషనల్ కోర్సులకు, ఉద్యోగ పోటీ పరీక్షలకు కోచింగ్ కల్పించాలనే ఉద్దేశంతో 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఒక చిన్న, సాధారణ కోచింగ్ సెంటర్ గ ఆవిర్భవించిన సి.ఈ.డి.ఎం,తన ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో మైనారిటీల అభివృద్ధిలో ఒక కల్పతరువుగా మారిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ను ఏర్పాటుచేసిన ఘనత, ఉపాధి కల్పనకు ఆటోనగర్ లు ప్రారంభించిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సారధ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా, దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యున్నత సాంకేతికతతో కూడిన సరికొత్త సౌకర్యాలను మైనారిటీల సంక్షేమానికి కల్పించడం జరిగిందన్నారు. సి.ఈ.డి.ఎం ద్వారా ప్రపంచస్థాయి విజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ క్లాస్‌రూమ్ లను,డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. పోటీ పరీక్షల విద్యా బోధనలో పేరుగాంచిన ఢిల్లీ, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో ఉండే నిపుణులైన అధ్యాపకుల పాఠాలను, రాష్ట్రంలోని ప్రతి మారుమూల ప్రాంతంలో ఉన్న మైనారిటీ విద్యార్థులకు కూడా సమానంగా ఉచితంగా అందించేలా హై-టెక్ స్టూడియో రికార్డింగ్, లైవ్ బోధనా సదుపాయాలను ఏర్పాటు చేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

సి.ఈ.డి.ఎం-ఏపీ రూపొందించిన మొబైల్ యాప్ ను మైనారిటీ మంత్రి ఫరూక్ ప్రారంభించారు.

నిరుపేద కుటుంబాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు కోచింగ్ ఫీజులు భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన్నట్లు మంత్రి వెల్లడించారు. సి.ఈ.డి.ఎం ప్రత్యేక యాప్ ద్వారా యుపీఎస్సి, ఏపిపిఎస్సి,గ్రూప్స్, పోలీస్ రిక్రూట్‌మెంట్, డీఎస్సీ, టెట్, నీట్, ఐఐటీ జేఇఇ లాంటి దేశ, రాష్ట్ర స్థాయి అత్యున్నత పోటీ పరీక్షలకు పూర్తి ఉచితంగా, అత్యంత నాణ్యమైన శిక్షణను మొబైల్ ఫోన్ల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. మైనారిటీ విద్యార్థులు ముఖ్యంగా అమ్మాయిలు వారి ఇంటి నుండే వారికీ కావాల్సిన పోటీ పరీక్షలకు సంభందించిన క్లాసులు ఈ యాప్ ద్వారా చూడవచ్చునని వినవచ్చునని, ప్రత్యేక ఉచిత శిక్షణ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. టిడిపి ప్రభుత్వం 2014-2019 లో సిఇడిఎం కు రూ.36.50 కోట్లు కేటాయించడం ద్వారా 22,323 మంది విద్యార్థులు లబ్ది పొందడం జరిగిందన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి మైనారిటీల పక్షపాత ప్రభుత్వంగా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి రూ.12 కోట్లు సి.ఈ.డి.ఎంకు కేటాయించడం జరిగిందన్నారు.లి

**ఆచరించి చూపడమే "కూటమి" ఘనత** :హామీలతో సరిపెట్టే ప్రభుత్వం తమది కాదని, ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా నిధులు విడుదల చేసి ఆచరించడమే కూటమి ప్రభుత్వం ఘనత అని మైనారిటీ మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. మైనారిటీల ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అనుసరించిన విధానాలు సూపర్ హిట్ అ-య్యాయని అన్నారు.ఇటీవల జరిగిన డి ఎస్ సి పరీక్షల్లో సి.ఈ.డి.ఎం ద్వారా శిక్షణ పొందిన 1,780 మంది విద్యార్థులలో, ఏకంగా 152 మంది మైనారిటీ అభ్యర్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికై తమ కలలను నిజం చేసకోవడమే ఇందుకు నిదర్శమని అన్నారు. కాగా జగన్ అర్థం పర్థం లేని అసత్య ఆరోపణలు మెగా డీఎస్సీ పై చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 4000 మందికి టెట్ కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.అలాగే 350 మంది విద్యార్థులకు నీట్, ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏపీపీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్ ఉద్యోగాలు, టెట్ పరీక్షల్లో మునుపెన్నడూ లేని విధంగా మైనారిటీ విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తుండటం గర్వకారణంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో సి.ఈ.డి.ఎం సహకారంతో నడిచిన ఉర్దూ మీడియం పదవ తరగతి విద్యార్థులు రికార్డు స్థాయిలో 87శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారని అన్నారు.సి.ఈ.డి.ఎం ఆధ్వర్యంలో ఇటీవల 7000 మంది పదవ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఒక్కొక్కరికి 8 సెట్లు వర్క్ బుక్స్ ను ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. 2026-27 విద్యాసంవత్సరంలో గ్రూప్-I, గ్రూప్-II, పోలీస్ మొదలైన రిక్రూట్మెంట్ ల కోచింగ్ దాదాపు గా 9100 విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు.లి

**సి.ఈ.డి.ఎం పేరు మార్పుకు ప్రతిపాదన** : లిమైనారిటీల అభివృద్ధికి మార్గ నిర్దేశకత్వ భాగస్వామ్య పాత్ర పోషిస్తున్న సి.ఈ.డి.ఎం పేరును మార్చాలని పలువురు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకోవచ్చారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ స్టడీ సర్కిళ్ల తరహాలోనే సి.ఈ.డి.ఎం కూడా పనిచేస్తున్నప్పటికీ, సి.ఈ.డి.ఎం గురించి ఎక్కువ శాతం మందికి తెలియడం లేదని వివరించారు. వెంటనే మంత్రి ఫరూక్ స్పందిస్తూ పేరును మార్చేందుకు ప్రతిపాదన పంపాలని డైరెక్టర్ ను ఆదేశించారు. మైనారిటీ అనుబంధ శాఖల ద్వారా ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు మైనారిటీల సంక్షేమానికి చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు.వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ నేతృత్వంలో తాలీం -ఏ -హునర్ పథకం ద్వారా 250 మందికి ఉచిత కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్య, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ నేతృత్వంలో మెగా జాబ్ మేళా నిర్వహించి 608 మందికి ప్రైవేట్ ఉద్యోగాల కల్పన,హజ్ కమిటి చైర్మన్ హసన్ భాషా నాయకత్వంలో హజ్ -2025, హజ్ -2026 విజయవంతంగా నిర్వహన,ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ ఆధ్వర్యంలో వినూత్న పథకాలతో ఉర్దూ భాషాభివృద్ధికి జరుగుతున్న కృషి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ, అనుబంధ శాఖల డైరెక్టర్లు, సభ్యులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం-2026 కార్యక్రమం మూడో రోజూ విజయవంతం

- రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- సాంకేతిక పరిజ్ఞానంతో కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న నారా లోకేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం--2026" కార్యక్రమం మూడో రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ, రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

మూడో రోజు రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల ఇళ్లను సందర్శించగా మొత్తం మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించారు. మూడు రోజుల్లో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం తదితర రంగాల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.





మూడో రోజు రాష్ట్రంలోని 98.5 శాతం క్లస్టర్లు, అన్ని మండలాల్లో, 81.6 శాతం యూనిట్లలో ఈ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తూ అత్యధిక స్థాయిలో ఇంటింటి సందర్శనలు నమోదయ్యాయి. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

లికుప్పంలో మూడో రోజూ భువనమ్మ పర్యటనలి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మూడో రోజూ కుప్పంలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొన్నారు. వసనాడు, వేపూరు గ్రామాల్లో మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత సాధికారత సాధించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు.

# అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం



- "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్
- తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్‌ని ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్‌తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

# డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారం : టీడీపీ

- బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు డీఎస్సీ పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

డీఎస్సీ నియామకాలపై అవకతవకలు జరిగాయని చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన బహిరంగ చర్చ సవాల్‌ను స్వీకరించే ధైర్యం జగన్ మోహన్ రెడ్డికి లేదని మాణిక్యరావు అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పాఠశాలల విలీనంతో పాటు ఉపాధ్యాయులను విద్యేతర విధులకు వినియోగించి విద్యా వ్యవస్థను దెబ్బతీసిందని ఆరోపించారు. అలాగే పోలవరం ప్రాజెక్టు, ఇతర అంశాలపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను నిరాశపరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పారదర్శకంగా నియామకాలు చేపట్టి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. గతంలో ఏపీపీఎస్సీ నియామకాలు, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలు మరచిపోలేదని పేర్కొంటూ, డీఎస్సీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసీపీకి సూచించారు.

జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ మాట్లాడుతూ, డీఎస్సీ స్కాం పేరుతో వైసీపీ యువజన విభాగం చేస్తున్న ప్రచారం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన పారదర్శక నియామకాలపై బురదజల్లే ప్రయత్నాలను యువత నమ్మబోదన్నారు. వైసీపీ అసత్య ప్రచారాలను కొనసాగిస్తే టీడీపీ యువత తగిన విధంగా ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలను వివరిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయుడు ఓంకార్, కొనకళ్ల సత్యనారాయణ, కుంచకర్ల ధర్మతేజ, మన్నెం శ్రీనివాస్, పడకండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# ఢిల్లీలో ఘనంగా డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలు



- జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానం
- ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** భారత్ రైజింగ్ మోదీ ఎరా అనే సుప్రసిద్ధ పుస్తకం రచించినదుకు బీజేపీ మీడియా ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జి కిలారు దిలీప్ కి 'జాతీయ వాగ్దేవి పురస్కారం' అందుకున్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ ఆధ్వర్యంలో 'తెలుగు వెలుగు సంబరాలు', జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారే) జయంతి వేడుకలను ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అధ్యక్షత వహించగా, బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు ఎంపీలు హాజరయ్యారు. సినారే జయంతిని పురస్కరించుకుని ఆయన పేరు మీద ప్రత్యేక కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కవులు హాజరై కవితా పఠనం చేశారు.

ఈ వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి జాతీయ వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలతో పాటు జాతీయ వాగ్దేవి పురస్కారాలను కేంద్ర మంత్రి ప్రదానం చేశారు. జీవిత సాఫల్య పురస్కారాలు అందుకుంటున్న వారిలో పితాని సత్యనారాయణ, శాసనసభ్యులు ఆచంట, ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, ఆక్వా పితామహులు, శ్రీ చైతన్య రాజు చాన్సలర్ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, సీజే వేణుగోపాల్ రిటైర్డ్ ఎడిషనల్ చీఫ్ సెక్రటరీ ఒడిశా, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన ప్రవచనకారులు ఆకెళ్ళ విభీషణ శర్మ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్ .బాలాచారి, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. జర్నలిజంలో రాజశేఖర్‌రెడ్డి కనబరిచిన పనితీరుకు గుర్తింపుగా జాతీయ వాగ్దేవి ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు.

# గురు పౌర్ణమి సందర్భంగా జూపూడి రంగరాజుకు సత్కారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గురు పౌర్ణమి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజును ఘనంగా సత్కరించారు. అనంతరం బీజేపీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా రూపొందించిన "నీట్ ఉద్యమంలోని వాస్తవాలు" అంశంపై యువతకు అవగాహన కల్పించే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ, కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నీట్ లీకేజీ పేరుతో విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిజంగా విద్యార్థుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీలపై కూడా స్పందించాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే పేపర్ లీకేజీపై ఆందోళనల పేరుతో దేశ వ్యతిరేక నినాదాలు, భారత జవాన్లకు వ్యతిరేక వ్యాఖ్యలు, హిందూ ధర్మాన్ని కించపరిచే ప్రసంగాలు చేయడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

యువత ప్రతీ అంశంపై పూర్తి వాస్తవాలు తెలుసుకుని స్పందించాలని, అసత్య ప్రచారాలను నమ్మి ఎవరికీ పావులుగా మారవద్దని ఆయన సూచించారు. ఈ ఉద్దేశంతోనే గాయత్రి బెహరా రూపొందించిన అవగాహన పోస్టర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో జూపూడి హైమావతి, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, స్పైసెస్ బోర్డ్ జాతీయ డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ రాష్ట్ర లిటరేచర్ కమిటీ చైర్మన్ పాలపాటి రవికుమార్, గాయత్రి బెహరా, మహిళా మోర్చా జిల్లా కోశాధికారి డాక్టర్ స్రవంతి, ధార్మిక సెల్ కన్వీనర్ జంధ్యాల పవన్ కుమార్, పార్టీ కార్యదర్శి అన్న బాలరంగయ్య, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సుబ్బలక్ష్మితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై కమలం ఫోకస్

- నాలుగు జోన్లతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు.. సీనియర్ నేతలకు బాధ్యతలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని భారతీయ జనతా పార్టీ ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేసింది. గ్రామస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణ, సమన్వయం, వ్యూహరచన కోసం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తా ఆంధ్ర, రాయలసీమ అనే నాలుగు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు అనుభవజ్ఞులైన సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులతో నిరంతర సమన్వయం వంటి అంశాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది.

ప్రత్యేక కమిటీలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎమ్మెల్యే ఈశ్వర్‌రావు నడుకుడితి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడారి ఆనంద్ కుమార్, ఎమ్మెల్సీ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్యే డా. పొదల వెంకట పార్థసారథి సభ్యులుగా ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చే లక్ష్యంతో జిల్లా, మండల, శక్తికేంద్ర స్థాయిల్లో పార్టీ శ్రేణులతో సమన్వయం చేస్తూ సమగ్ర కార్యాచరణను అమలు చేయాలని కమిటీకి బాధ్యతలు అప్పగించినట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బూత్ స్థాయి బలోపేతం, కార్యకర్తల సమీకరణ, ఎన్నికల నిర్వహణలో సమర్థవంతమైన వ్యూహంతో ముందుకు సాగాలని కమిటీ సభ్యులకు సూచించినట్లు వెల్లడించారు.

# ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నేడు

- సమావేశం అనంతరం మూడో దశ ఆందోళన కార్యక్రమాల ప్రకటన

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంపై సమీక్ష నిర్వహించడంతో పాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న మూడో దశ ఆందోళన కార్యక్రమాలను ఈ సమావేశం అనంతరం అధికారికంగా ప్రకటించనున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

ఆర్టీసీలో ప్రైవేటు విద్యుత్ బస్సుల ప్రవేశం వల్ల సంస్థ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంస్థ బలోపేతం, పెండింగ్ సమస్యల పరిష్కారంపై భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ జూన్ 11న సమర్పించిన వినతిపత్రంపై చర్చించేందుకు గురువారం సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో వీసీ ఏ ఎండీతో పాటు ఉన్నతాధికారులు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి హాజరు కావాలని ఆర్టీసీ యాజమాన్యం జేఏసీ ప్రతినిధులకు అధికారికంగా లేఖ పంపినట్లు వెల్లడించారు.

వీసీ & ఎండీతో జరిగే చర్చలకు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు నేతృత్వంలో కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, యస్.వి. శేషగిరిరావు, కే. సూర్యప్రకాశరావు, డి. మాల్యాద్రి తదితరులు హాజరుకానున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని, చర్చల ద్వారా పరిష్కారం లభించకపోతే మూడో దశ ఆందోళన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతం చేస్తామని జేఏసీ నాయకత్వం స్పష్టం చేసింది.

# 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. నేడు (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు.

వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

# పోలీస్ శాఖలో భారీ రిక్రూట్‌మెంట్..

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ పోలీస్ నియామక మండలి ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వీటి ద్వారా సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో ఖాళీగా ఉన్న దాదాపు 7,437 ఉద్యోగాలు భర్తీ చేయనుంది. ఈ ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలను త్వరలో పోలీస్ నియామక మండలి ప్రకటించనుంది. దరఖాస్తుకు ముందు వైద్య, శారీరక ప్రమాణాలు పరిశీలించుకోవాలని అభ్యర్థులకు సూచించింది.

కానిస్టేబుల్ (సివిల్) 3,697; కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులు

# దౌర్జన్యంగా అన్నదాన సత్రం బోర్డు తొలగింపు

- ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం
- కమిటీ లోని ఒక వ్యక్తితో అగ్రిమెంట్ చేసుకొని..దౌర్జన్యం
- లీజు అగ్రిమెంట్ మీకు చూపాల్సిన అవసరం లేదు
- సంఘటన పై విచారించిన పోలీసులు
- కరస్పాండెంట్ మాధవ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం బుధవారం సాయంత్రం విజయవాడ ఆర్టీసీ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం బోర్డును దౌర్జన్యంగా తొలగించినట్లు సత్రం కమిటీ సభ్యులు సత్యనారాయణ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఎందుకు గత పది సంవత్సరముల నుంచి కరస్పాండెంట్ మాధవరెడ్డి విజయవాడ ఆర్టీసీ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నందు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలను నడుపుతూ ఉన్నారు. ప్లీజ్ అగ్రిమెంట్ పూర్తయిన సందర్భంగా సత్రం కమిటీ యాజమాన్యం ఖాళీ చేయమని కోరగా వారి మధ్య కొంత గతంలో వివాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం లో స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న విజయవాడ ఆర్టీసీ విశ్వబ్రాహ్మణుల అన్నదాన సత్రానికి సంబంధించిన బోర్డులను దౌర్జన్యంగా తొలగించినట్లు సత్రం సభ్యులు సత్యనారాయణ తెలియజేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసుకొనుటకు కొద్ది కాలం కొందరు సభ్యుల చేత లీజుకు తీసుకోవడం జరిగిందని, అయితే లీజుకు తీసుకున్న వ్యక్తి దౌర్జన్యంగా ఏళ్ల తరబడి అక్కడే తిష్ట వేసి ఒకరికి తెలియకుండా ఇంకొకరితో అగ్రిమెంట్ రాయించుకుంటూ కాలయాపన చేస్తున్నాడని విశ్వబ్రాహ్మణ సత్రం సభ్యుడైన సత్యనారాయణ తెలియజేశారు. సత్రం యజమానులు ఖాళీ చేయమని చెప్పినప్పటికీ ఖాళీ చేయకుండా అలాగే దౌర్జన్యంగా ఉండటంపై సత్రం యజమానులు ఆక్షేపిస్తూ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం చైర్మన్ కమ్మరి పార్వతమ్మ వద్దకు గత 6 నెలల క్రితం పంచాయతీని తీసుకు వెళ్లడం జరిగిందని వారు తెలియజేసారు. దీంతో చైర్మన్ కమ్మరి పార్వతమ్మ పంచాయతీ చేసి జూలై 31వ తేదీ వరకు కళాశాల యజమానులకు అనుమతిస్తూ, ఆగస్టు 1నుంచి సత్రం నుంచి కళాశాల ఖాళీ చేయాలని ఆదేశించి, మాధవరెడ్డి అనే వ్యక్తి తో అగ్రిమెంట్ కూడా రాపించినట్లు ఆయన వివరించారు. ఇదే విషయాన్ని సత్రం యజమానులు ఒక ఫ్లెక్సీని తయారుచేసి సత్రం ఎంట్రన్స్ లో బిగించడం జరిగింది. అయితే ఈరోజు అనగా బుధవారం కొందరు కళాశాలకు చెందిన వ్యక్తులు ఆ బోర్డులను దౌర్జన్యంగా తొలగించినట్లు సత్యనారాయణ తెలియజేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంటు ఇవ్వనున్నట్లు వారు తెలియజేశారు. 12 ఏళ్లుగా ఒక డిగ్రీ కళాశాల పూర్తిగా నిర్మాణం లేని ఒక అన్నదాన సత్రంలో ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. పదిమందికి అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తే, కేవలం మూడేళ్లు, ఐదేళ్లు అని లీజుకు తీసుకొని చివరికి 12 ఏళ్లు పైబడినప్పటికీ కూడా కళాశాల యజమానులు అన్నదాన సత్రం వారికి అప్పగించకుండా దౌర్జన్యంగా ఉండటంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం చాలా రోజులుగా జరుగుతున్నా కూడా సంబంధిత ఏ అధికారులు కూడా పట్టించుకోక పోవడంపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే రేపు సత్రం ఖాళీ చేయాలని ఒక వర్గం, ఖాళీ చేయమని ఒక వర్గం పట్టుదలతో ఉండటంతో ఘర్షణలు కూడా జరిగే అవకాశాలు లేకపోలేదని కొందరు స్థానికులు అంటున్నారు.

**కరస్పాండెంట్ మాధవ రెడ్డి వివరణ**

బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల స్థానిక విజయవాడ ఆర్టీసీ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నందు తీసుకొని కళాశాలను నడుపుతూ ఉన్నారు. కానీ బుధవారం నాడు సాయంత్రం అన్నదాన సత్రం బోర్డును తొలగించే విషయంపై కరస్పాండెంట్ మాధవ రెడ్డిని వివరణ కోరగా ఆయన జ్యోతి రిపోర్టర్ తో మాట్లాడుతూ గతంలో ఈనెల 31వ తేదీ నాడు డిగ్రీ కాలేజీని అన్నదాన సత్రం నందు లేకుండా ఖాళీ చేసి వెళతామని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ దగ్గర అగ్రిమెంటు రాసి ఇవ్వడం వాస్తవమేనని, కానీ మళ్లీ అన్నదాన సత్రం కమిటీ సభ్యులలో అందరూ ఈజ్ అగ్రిమెంట్ను తొలగిస్తూ అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సత్రం వారు రాయించిన అగ్రిమెంటు రిపోర్టర్ అడగగా మీకు చూపించాల్సిన అవసరం మాకు లేదని, అవసరం ఉన్నచోట చూపిస్తామని ఆయన సమాధానం ఇచ్చారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం..

- ◆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ◆ సోన్ మండల రైతు వేదిక, పర్వతగిరి రైతులతో ముచ్చట..
- ◆ కార్యక్రమాల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు..






**హైదరాబాద్, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని జిల్లాల మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు.
'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సూచనలను రైతులకు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంట మార్పిడి ద్వారా విజయాలు సాధించిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.
సోన్ మండల రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ సంతోష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం, హైదరాబాదు నుంచి ఆయన పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికను ఉద్దేశించి మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సంబందిత అధికారులు రైతులు హాజరయ్యారు. రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యంమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలపై సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జొన్న, సజ్జ, పెసర, మినుము, కంది వంటి పంటలను ఎంచుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, ఆయిల్ ఫామ్ పంటల సాగును పెంచేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆరుతడి పంటలు పండించుకునే విధంగా రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. వరి కాకుండా అరితడి పంటలు సాగు చేస్తున్న రైతులకు మెమెంటోలను అందజేసి శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్
డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ..



రైతులు వర్షాభావ పరిస్థితును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిర్దేశించిన సూచనలను పాటించాలి. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి, ఏడిఈ నర్సింగం, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి వేణు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సావిత్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, స్థానిక సర్పంచ్ శంకర్, వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి..

- ◆ విద్యా వ్యతిరేక విధానాలను మానుకోవాలి..
- ◆ డిమాండ్ చేసిన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమారస్వామి



**యాదగిరిగుట్ట, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్లను,వెంటనే విడుదల చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు బీజేవైఎం నాయకులు. ఈ సందర్భంగా ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి! పేరుతో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, యాదగిరిగుట్టలో ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమారస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కూడా తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. రేవంత్ రెడ్డి పేపర్ లీకు రెడ్డిగా మారారని ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతూన్నారని మండిపడ్డారు. మండలానికొక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా అని ప్రగల్బాలు పలికి, జిల్లాకు ఒకటి కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు.. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని వాగ్దానం ఇచ్చి వాటిని తుంగలో తొక్కారని, డిగ్రీ, వృత్తి విద్య అభ్యసించిన వారికి లక్షల్లో స్టైయిఫండ్ ఇస్తామని చెప్పిన మాటలు ఉట్టి మూటలుగా మిగిలాయని అన్నారు. రాబోయే కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వానికి విద్యార్థి యువకుల చేత చేదు అనుభవం తప్పదని, విద్యా వ్యతిరేక విధానాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య,స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షులు గుంటిపల్లి సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్లు మహేష్, ఆకుల చంద్రమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు భువనగిరి శ్యాంసుందర్, బెల్లిదే అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, పలుగుల సురేష్, బోడ సురేష్, మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్, కార్యదర్శులు ఆవుల సత్యనారాయణ, ప్రభాకర్, ఆలేటి కర్ణ, బీజేవైఎం పట్టణ నాయకులు బుజ్జి బాబు, సీనియర్ నాయకులు రంగసత్యం, బండి మహేష్, జిల్లా భానుచందర్, జోగు మహేష్, ఆకుల దేవేందర్, వినోద్, శివ, సాయి, గాదె వంశీ, శివరాత్రి వంశీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఫోకస్

- ◆ పాఠశాలల్లో 100 శాతం హాజరే లక్ష్యం
- ◆ ఎస్ఐఆర్ డిజిటైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- ◆ చిన్నారుల ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణకు ఆదేశం
- ◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**గద్వాల, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించి, విద్యార్థులు-ఉపాధ్యాయుల హాజరు 100 శాతం ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాల ఆవరణ, తరగతి గదులు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. నాలుగో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించడంతో పాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, ఇతర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, చదువుపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ఇంటింటి సర్వేను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. బీఎల్ఓలు పూర్తి బాధ్యతతో సరైన సమాచారాన్ని సేకరించి వెంటనే డిజిటైజేషన్‌కు అప్‌లోడ్ చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించి అర్హులైన ఓటర్లు ఎవరూ మిగలకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

అంగన్వాడీల్లో పోషణతో పాటు నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం..

అనంతరం గద్వాల మండలం చెనుగొనిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన, ఇతర సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే బలమైన పునాది అని పేర్కొన్న కలెక్టర్, చిన్నారులు క్రమం తప్పకుండా కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య అందించాలని, సామ్-మామ్, స్టంటింగ్ సమస్యలు ఉన్న చిన్నారులను ముందుగానే గుర్తించి వారికి ప్రత్యేక పోషకాహారం అందించాలని సూచించారు.
తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, శిశు సంరక్షణ, ఆరోగ్యకరమైన అలవాట్లపై నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్యను సమర్థవంతంగా బోధించి చిన్నారుల విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయాలని కలెక్టర్ సూచించారు. తనిఖీలో భాగంగా చిన్నారుల బరువును పరిశీలించి, వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి చదువు, ఆటపాటల గురించి తెలుసుకుని, పిల్లలను మరింత చురుకుగా, క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు.
ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ హరికృష్ణ, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, చిన్నారులు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి...

- జైపాల్ రెడ్డి తెలంగాణలో మాత్రమే కాదు దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప పార్లమెంటేరియన్...
- విద్యా రంగానికి విశేష సేవలందించిన విశ్రాంత అధ్యాపకులు రావూరి సూర్య నారాయణ,ఆలూరి గంగయ్యకు "స్మారక స్ఫూర్తి పురస్కారాలు అందజేత...



**దేవరకద్ర జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్‌నగర్ పట్టణంలోని ధర్మాపూర్ జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉత్తమ పార్లమెంటేరియన్,మాజీ కేంద్రమంత్రి కీ.శే. ఎస్. జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఛైర్మన్ కె.ఎస్. రవికుమార్ గారి ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి,కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎస్. జైపాల్ రెడ్డి గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మిథున్ రెడ్డి మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి గారు తెలంగాణకు మాత్రమే కాకుండా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప పార్లమెంటేరియన్ అని కొనియాడారు. విలువలతో కూడిన రాజకీయాలు, ప్రజా స్వామ్యంపై అచంచలమైన విశ్వాసం, సమాజం మరియు దేశ అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. జైపాల్ రెడ్డి గారి స్పష్టమైన ఆలోచనా విధానం, అద్భుతమైన వాగ్ధాటి, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల ఆయనకున్న గౌరవం, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని మిథున్ రెడ్డి గారు పేర్కొన్నారు.
ఆయన ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం విద్యా రంగానికి విశేష సేవలందించిన విశ్రాంత అధ్యాపకులు శ్రీ రావూరి సూర్య నారాయణ గారికి, శ్రీ ఆలూరి గంగయ్య గారికి "స్మారక స్ఫూర్తి పురస్కారాలను" అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొని స్వర్గీయ జైపాల్ రెడ్డి గారికి ఘన నివాళులు అర్పించారు.

## పెద్ది కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి పొంగులేటి,
# నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ప్రముఖ టిఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై సికింద్రాబాద్లోని యశోద ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు యశోద ఆసుపత్రిలో పెద్ది కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా పెద్ది ఆరోగ్య స్థితిగతులను యశోద ఆసుపత్రి వైద్య బృందంతో సమావేశమై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేసి పెద్ది సుదర్శన్ రెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేకుండా కాపాడాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి యశోద ఆసుపత్రి వైద్య వర్గాలను కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి మాజీ జెడ్ పి ఫోర్ లీడర్ సిద్ది స్వప్నను హాస్పటల్ లో కలిసి ధైర్యం చెప్పారు. అదేవిధంగా వరంగల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, శ్రీరామ్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు నంద్యాల వినయ్ రెడ్డిలు వేర్వేరుగా పెద్ది కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని ఓదార్చారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.



**వెంకటాపురం(నూగూరు), జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల ప్రవర్తనంగా ఉండాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాకాలంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్దిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం తీసుకున్న మరో విప్లవాత్మక నిర్ణయం
# అల్పాహార (సీఎం బ్రేక్ ఫాస్ట్ )పథకం..

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది పేద విద్యార్థుల ఆకలి తీర్చే అద్భుతమైన పథకం...
- రుచికరమైన, పౌష్టిక 'అల్పాహార పథకం' ప్రారంభం...
- జి.మధుసూదన్ రెడ్డి దేవరకద్ర శాసన సభ్యులు



**దేవరకద్ర, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది పేద విద్యార్థులకు రుచికరమైన, పౌష్టిక 'అల్పాహార పథకం' ప్రారంభం అయింది.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని,విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్ రెడ్డి గారు అద్భుతమైన ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించారు. హరే రామా హరే కృష్ణ' సంస్థ సహకారంతో అత్యాధునిక కిచెన్లలో అత్యంత శుభ్రంగా వంటకాల తయారీ చేపడుతూ విద్యార్థులకు అందిస్తున్నారు. ఆకలితో ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో, వారి ఆరోగ్యం, ఏకాగ్రత పెంపొందించే దిశగా ఈ అడుగు వేసింది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన శాసన సభ్యులు జిమ్మెర్ పేర్కొన్నారు. పరిశుభ్రమైన వంటశాలలో అల్పాహారం తయారీ...రుచి, శుభ్రత అద్భుతం.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం కావాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## సర్ పక్రియపై
# కాంగ్రెస్ శ్రేణులకు మాజీ ఎంపీ సోయం బాపూరావు దిశానిర్దేశం

- సోనాల మండల బిఎల్ఎ-2లతో ప్రత్యేక సమావేశం అయిన మాజీ ఎంపీ సోయం బాపూరావు



**ఆదిలాబాద్, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలం లోని ఆయా గ్రామాల్లో సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ-2లతో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలం లోని వజ్జర్, కేశవ్ గూడా, నాగూగూడ, చింతల్ బోరి, పార్డి కే, పార్డి బీ, ఘనపూర్, సోనాల గ్రామ పంచాయితీ లో సమావేశామై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియకు సంబంధించి బిఎల్ఎ-2లు చేపట్టాల్సిన కార్యాచరణ, ఓటర్ల జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల వివరాల నమోదు, తప్పులు ఉంటే సవరణలు చేయించడం తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు ఈ సమావేశంలో మండల అధ్యక్షులు గాజుల పోతన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ,సర్పంచుల సంఘం అధ్యక్షుడు వినోద్ సింగ్,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్,అధికార ప్రతినిధి చంటి జిల్లా కార్యదర్శులు లోలపు పోశెట్టి,హరిసింగ్ మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,ఓబీసీ నియోజకవర్గ చైర్మన్ జంగాల బోజన్న ,మార్కెట్ డైరెక్టర్ సోమన్న,ఆత్మ డైరెక్టర్ ముండే శ్రీధర్,వజ్జర్ సర్పంచ్,లక్ష్మణ్,చింతల్బోరి సర్పంచ్,శ్రీరామ్,ఘనపూర్ సర్పంచ్ మడవి రమాదేవి,కోట కె సర్పంచ్ పూజ సంగ్రామ్,కాంగ్రెస్ పార్టీ దీూా లు రామాయి రవి,బశెట్టి సుదర్శన్,మద్దెల మహేష్,జాకు,సదాశివ్,ప్రకాష్,దేవులనాయక్ తండా ఉపసర్పంచ్,జాదవ్ అరవింద్,మాజీ సర్మేడి బాండు పటేల్,మాజీ సర్పంచ్ సోయం బాపూరావు,సీనియర్ నాయకులు కసిరే పోతన్న,భీంరావు పాటిల్,అమృత్ రావు,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి - సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్.

**నిజామాబాద్, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు.ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు.ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు.అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్,ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.

## లక్ష్మీనారాయణ హోమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



కాకతీయనగర్ డివిజన్ పరిధిలోని సమతనగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి హోమం, ప్రత్యేక పూజల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ముద్దం సంపత్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం కుటుంబ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే, లక్ష్మీనారాయణ స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మేంద్ర యాదవ్, సంపత్ యాదవ్, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలకు వేతనాలు, సదుపాయాలు కల్పించాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**

గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని వాణినగర్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితా డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే, వారికి తగిన వేతనాలు చెల్లించడంతో పాటు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ మాను చౌదరి, మల్కాజ్‌గిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానాకు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర కీలకమని, వారికి అవసరమైన ప్రోత్సాహం, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని

## ఈ-కేవైసీ పూర్తి చేయని 5.52 లక్షల రేషన్ కార్డుదారులు.. జూలై 31లోగా నమోదు చేసుకోవాలి

**మల్కాజ్‌గిరి, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో రేషన్ కార్డుదారుల ఈ–కేవైసీ నమోదు ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 22,60,451 మంది రేషన్ కార్డు సభ్యులు ఉండగా, ఇప్పటివరకు 17,07,731 మంది ఈ–కేవైసీ పూర్తి చేశారని వెల్లడించారు. మరో 5,52,720 మంది సభ్యులు ఇంకా నమోదు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.కమీషనర్, పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు ఈ–కేవైసీ పురోగతిపై నిరంతరం సమీక్షా సమావేశాలు, డీలర్లతో టెలీకాన్ఫరెన్సులు నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ–కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు తమకు సమీపంలోని చౌకధరల దుకాణాన్ని సందర్శించి ఈ నెల 31లోగా తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు. అలాగే నెలాఖరు వరకు అన్ని రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి, ఈ–కేవైసీ కోసం వచ్చే కార్డుదారులకు అవసరమైన సహకారం అందించాలని డీలర్లను ఆదేశించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు.

## ఉద్యోగాలలో ప్రతిభ సాధించిన యువకుడికి సన్మానం -కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



మంచాల మండలంలోని యువకుడు ఒకేసారి ఐదు ఉద్యోగాలు సాధించిన ఆరుట్ల గ్రామస్తుడు చిందం అంజన్ కుమార్ ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం సుగుణమ్మ కృష్ణయ్యల కుమారుడు అంజన్ కుమార్ ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మంగళవారం వారం రోజున కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆ యువకుడిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన అంజన్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్లర్క్,హైకోర్టు ఫీల్డ్ అసిస్టెంట్, రెండు రైల్వే ఎన్ టి సి పి ఉద్యోగాలు టీజీ ఎస్ఆర్టిసి సూపరిండెంట్ ఇలా ఒకేసారి ఐదు ప్రభుత్వ కొలువులు సాధించడం గర్వకారణం అని అన్నారు నేటి యువత అంజన్ కుమార్ ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడుస్తూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య మార సురేష్ వస్పరి కుమార్ ఎండి అశ్రఫ్ కోరె పాండు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపూర్ కాలనీ పాఠశాలలో - రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ బృందం సందర్శన

**సంగారెడ్డి, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



సదాశివపేట మండలం లోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం–యం.హెచ్.టి (ఎ) సదాశివపేట వైద్య బృందం మంగళవారం సందర్శించి,పాఠశాల విద్యార్థులందరికి వైద్య పరీక్షలు నిర్వహించింది.ఈ సందర్శన సందర్భంగా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం వైద్యాధికారి డా.మెహనాజ్ మాట్లాడుతూ, పాఠశాలలోని అందరు విద్యార్థులు ఆరోగ్యంగా మరియు క్రమశిక్షణతో ఉన్నారని తెలిపారు.విద్యార్థులలోఎటువంటి వ్యాధి లక్షణాలు గానీ, పోషకాహార లోపాలు గానీ గుర్తించలేదని స్పష్టం చేశారు.పాఠశాలలో చాలా మంచి వాతావరణం ఉందని, పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల కోసం అద్భుతమైన కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సేవలను పొగడడానికి మాటలు చాలవని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం బృందం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, సిబ్బంది వరలక్ష్మి , సంయుక్త పాల్గొన్నారు.

## ఆర్కేపురంలో బీఆర్ఎస్‌కు బలం.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో భారీ చేరికలు

**మల్కాజ్‌గిరి, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి బలోపేతానికి చేరికలు కొనసాగుతున్నాయి. నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని ఆర్కేపురానికి చెందిన ఆకాష్, కిరణ్ కుమార్, అనిల్‌తో పాటు పలువురు బస్తీవాసులు మంగళవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోందని అన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ సమస్యల పరిష్కారంలో పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజల్లో మరింత విశ్వాసం పెంచాలని కోరారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువత, స్థానికులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలో చేరే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.పార్టీలో చేరిన ఆకాష్, కిరణ్ కుమార్, అనిల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రవీందర్, సుమన్ గౌడ్, విజయరెడ్డి, ఆర్కేపురం బస్తీవాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు -బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

**నిజామాబాద్, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఇందూరు బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ,మిస్ కాల్ ఉద్యమం ప్రారంభించారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ..రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువును కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అప్పులు చేసి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల విద్య హక్కును కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమని,పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడం మానుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.లేని యెడల ఇందూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం అన్నారు.ఈ ప్రభుత్వనికి విద్యార్థుల ఉసురు తాగుల్తది అని అన్నారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ గౌడ్ మాట్లాడుతూ..విద్యార్థుల సమస్యలపై బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.సంతకాల సేకరణ ద్వారా విద్యార్థుల గళాన్ని ప్రభుత్వానికి వినిపిస్తున్నామని,ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే బీజేపీ,బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా,రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి భారీ ఆందోళనలు,ధర్నాలు,నిరసన కార్యక్రమాలు చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర–కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ,బీజేపీ జిల్లా నాయకులు విపుల్ రావు,రాకేష్,రాజ్ గణేష్,బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఓం సింగ్,బీజేవైఎం నాయకులు సాయి ప్రవీణ్ తో పాటు పలువురు బీజేపీ,బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘ బోనాల మహోత్సవ కరపత్రికను పులిమామిడి రాజుకు అందించిన సంఘం సభ్యులు



**సంగారెడ్డి,(జర్నలిస్ట్ ఫైల్) :** సదాశివపేట పట్టణంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న మొదటి సారిగా నిర్వహించనున్న సామూహిక బోనాల మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రికను సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజుకు సంఘం సభ్యులు అందజేసి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. దీనికి పులిమామామిడి రాజు స్పందించి, వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ తేది 31-07-2026 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు మున్నూరుకాపు సంఘ భవనము ఎన్కెపల్లి రోడ్డు నుండి సామూహిక బోనాల ఊరేగింపు వైభవంగా ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దర్శన కార్యక్రమం అనంతరం సంఘ భవనంలో మహా ప్రసాదం, భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మహోత్సవంలో మున్నూరుకాపు కులబాంధవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఇట్టి కార్యక్రమంలో సంఘం అధ్యక్షులుసిద్దాపురం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వెంకటేశం, గంట శివయ్య,అలుగోలు శ్రీనివాస్, సతీష్, శంకర్, చీలం సురేష్, ఖర్చర్ల నరేష్, చెప్యాల అనిల్, కాసాల శ్రీనివాస్, రాము, గంట శేఖర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- పర్యావరణ పరిరక్షణలో మన వంతు బాధ్యతను నెరవేర్చుదాంఅంటున్న స్మార్ట్ కిడ్జ్ పాఠశాల

**ఖమ్మం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**





స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ సహిత జ్యూట్ బ్యాగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో కలిసి జ్యూట్ బ్యాగుల ఆవిష్కరణను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ ను దూరంగా ఉంచాలని , పర్యావరణ సహిత జూట్ బ్యాగులను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేయడం అభినందనీయం అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేస్తున్నాము అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరంతో పాటు ఈసారి కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫోరం నింపి ఇవ్వని వాళ్లు అందరు సద్వినియోగం చేసుకోవలి

### : తాసిల్దార్ బి రాములు

**రాజేంద్రనగర్ (జర్నలిస్ట్ ఫైల్) :**



తహశీల్దార్ రాజేంద్ర నగర్ కార్యాలయంలో లక్ష్మీగూడ,మైలార్ దేవులపల్లి,కాటెదాన్,గగన్ పహడ్,శాస్త్రిపురం,బుద్వేలు లకు సంబంధించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఎ.ఇ.ఆర్.ఓ.,తహశీల్దార్ బొమ్మ రాములు సమావేశం ఏర్పాటుచేసి 86 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 107441 మంది ఓటర్లు ఉన్నట్లు రాజేంద్రనగర్ తహసిల్దార్ బి రాములు తెలిపారు.మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్యూమరేషన్ ఫోరలు ఎన్ని పంచారని సంబంధిత అధికారులను వివరణ కోరడం జరిగిందని సూచించారు.అంతేకాకుండా ఇప్పటి వరకు 53264 మందికి డిజిటైజేషన్ అయినట్లు ఇంకను 47714 మంది ఓటర్లు డిజిటైజేషన్ కావలసి ఉన్నట్లు,వాటి వివరాలు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అందజేయడం జరిగిందన్నారు.అర్హులైన ఓటర్లను ఎన్యూమరేషన్ ఫోరం పూర్తిచేసి వెంటనే బి.యల్.ఓలకు అందజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.ఈసమావేశంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ గురించి చర్చించినట్లు సూచించారు.ఈ అవకాశాన్ని ఎన్యూమరేషన్ ఫోరం నింపి ఇవ్వని వాళ్లు అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేపట్టాలి

### : వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- రైతులకు నష్టం జరగకుండా ముందస్తు అవగాహన కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన రైతులు పంటలనే సాగు చేయాలి
- 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ మంత్రి నిర్వహించిన కార్యక్రమంలో రఘునాథపాలెం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**

రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో "రైతు నేస్తం" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రఘునాథపాలెం మండలంలోని రైతు వేదికలో పాల్గొని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను వీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి రైతులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలని అన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని, ఆయిల్ పామ్ తోటల్లో జాజి, మిరియాలు, కోకో వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. భూగర్భ జలాల స్థితిని ప్రతిరోజూ రైతులకు తెలియజేసి, ఆ సమాచారాన్ని వ్యవసాయ ప్రణాళికలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆనతరం రైతు వేదిక లో ఏర్పాటు చేసిన విత్తన మేళా ను కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. అక్కడ రైతులకు ప్రస్తుత పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్ నినో ప్రభావం వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు. రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జిల్లాలో అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు స్వల్పకాలిక, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులు ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ మొత్తం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. వర్షాలు కురుస్తున్నాయని భావించి నీటిని పూర్తిగా సాగుకు విడుదల చేస్తే, తరువాతి దశలో వర్షాలు తగ్గిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. గత అనుభవాల కంటే భిన్నమైన పరిస్థితులు నెలకొన్నందున రైతులు ఆలోచించి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా వినియోగిస్తూ ఉన్నామని, ఇరిగేషన్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు సాధ్యమైనంత మేర సహకారం అందిస్తామని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలు, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- రూ. 12వేల హామీని నెరవేర్చాలి
- ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

**ఖమ్మం, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**




ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు వెంటనే ఇవ్వాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా గౌరవాధ్యక్షులు పగడాల మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ (ఏఐటియుసి) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఖమ్మం ఆర్టిఏ కార్యాలయం ఎదుట ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆర్టిసి తర్వాత లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే అతిపెద్ద రవాణా వ్యవస్థ ఆటో రంగమేనన్నారు. ఉపాధి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా జీవనోపాధి కోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి రోజు మారుమూల గ్రామాల, పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. అటువంటి ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత 30 ఏళ్ల -నుండి ఆటో కార్మికులు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పోరాటం చేస్తున్నారన్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లయినా ఆటో కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చి దానిని నేటికి నెరవేర్చలేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఏడాదికి రూ.12వేలు విడుదల చేయాలన్నారు. పట్టణాలు, నగరాల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసి అక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల శ్రీనివాసరావు, పేరబోయిన మోహన్రావు, జిల్లా ఉపాధ్యక్షులు టేకుమట్ల శ్రీనివాస్, -సహాయ కార్యదర్శి షేక్ రఫీ, కోశాధికారి ఆరెంపుల సతీష్, జిల్లా సమితి సభ్యులు మీనుగుల నాగేశ్వరరావు, మేళ్లచెరువు -గురవయ్య, రామకృష్ణ, మహేష్, పగడాల మన్మథరావు, మేనయ్య, కొమ్ము రాజు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణే లక్ష్యం..జలసిరి - వీబీజీ రాంజీ

### గ్రామసభలు విజయవంతం

**కేశంపేట, జూలై 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



కేశంపేట మండల పరిధిలోని కోతపేట, సంగెం, ఆల్వాల, వేములనర్వ, బైర్కాన్‌పల్లి, కొనాయపల్లి, పోల్కొని గుట్ట తండా, పాటిగడ్డ, తూర్పుగడ్డ తండా, సుందరాపూర్ గ్రామపంచాయతీలలో జలసిరి-వీబీజీ రాంజీ పథకాలపై గ్రామసభలు విజయవంతంగా నిర్వహించారు. గౌరవ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలకు గ్రామస్థులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.గ్రామసభలకు ప్రత్యేకాధికారులుగా ఎంపీవో దయానంద్, ఏపీవో అజీజ్, ఏపీఎం కవిత, మండల వ్యవసాయాధికారి రామశివరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొని జలసిరి కార్యక్రమం లక్ష్యాలు, వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యత, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యుల నుంచి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించి, వాటి అమలు విధానాన్ని వివరించారు.కోతపేట గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ జీ. రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జలసిరి-వీబీజీ రాంజీ పథకాల కింద మండలంలో సుమారు 318 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. "ఇంటికి ఇంకుడు గుంట – పొలానికి పంటకుంట – ఊరికి ఊటకుంట" అనే నినాదంతో ప్రతి కుటుంబం వర్షపు నీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల పెరుగుదలతో వ్యవసాయానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమానికి మహిళా సంఘాలు, రైతులు, గ్రామస్థులు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇవ్వగా, ప్రజల భాగస్వామ్యంతో పథకాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవాలు



- శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారికి నాణేలతో విశేష తులాభారం
- సమాధి పూజలు, పీఠాధిపతుల చేతుల మీదుగా తీర్థప్రసాద వితరణ
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసుల ప్రత్యేక బందోబస్తు

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, శోభాయమానంగా జరిగాయి. మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి దివ్య సమక్షంలో ఈ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**స్వామివారికి నాణేలతో తులాభారం:**
ఈ వేడుకల్లో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలో పీఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారిని ఆయన శిష్యులు నాణెములతో ఘనంగా తులాభారం నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ధర్మపత్ని ఉమాదేవి అమ్మగారు, మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి పాల్గొని పూజలు నిర్వహించారు.

**సమాధి వద్ద ప్రత్యేక పూజలు:**
అంతకుముందు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వాములవారు, వారి సోదరులు దత్తాత్రేయ స్వామితో కలిసి తమ తండ్రిగారైన కీర్తిశేషులు శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారి సమాధి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మఠానికి విచ్చేసిన భక్తజన సందోహానికి, శిష్యులకు పీఠాధిపతులు స్వయంగా తీర్థప్రసాదాలు అందజేశారు.

**భక్తుల సేవలో పోలీస్ యంత్రాంగం:**
గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక సర్కిల్ ఇన్ స్పెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు సబ్ ఇన్ స్పెక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుళ్లు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. క్యూలైన్లు ట్రాఫిక్ నియంత్రణను నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు సేవలందించారు.

## పోలీసు కుటుంబాల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం



- గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శంకర ఐ హాస్పిటల్ సౌజన్యంతో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు, ఆర్ఐ శ్రీహరి రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించబడింది.

శంకర ఐ హాస్పిటల్‌కు చెందిన నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ సృష్టి, వైద్య బృందం పోలీసు సిబ్బందికి సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. కంటి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన శంకర ఐ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ సృష్టి, వైద్య బృందానికి జిల్లా ఎస్పీ తరఫున వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## శాకాంబరి అలంకరణలో పోలేరమ్మ



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** గురు పౌర్ణమి ని పురస్కరించుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా లో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## గుండె పోటుతో భక్తుడు మృతి

- గురు పౌర్ణమి సందర్బంగా బ్రహ్మంగారి స్వామి దర్శనానికి వచ్చిన బళ్లారి వాసి



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠంలో గురు పౌర్ణమి నాడు అపశృతి చోటుచేసుకుంది. బళ్లారి జిల్లా వన్నెలూరు గ్రామం కి చెందిన వన్నప్ప(55) గురు పౌర్ణమి సందర్భంగా బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు విచ్చేసిన వన్నప్ప మరియు అతని కుటుంబ సభ్యులు దర్శనం అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణంలో మఠం ఐదు రోడ్ల కూడలిలో హటాత్తుగా ఒక్కసారి గా కుప్పకూలిపోయాడు. 108 కి ఫోన్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించగా గుండెపోటుతో మృతి మృతి చెందినట్లు సమాచారం తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం
- ఉత్తమ విద్యా విధానం అమలు చేస్తాం
- తూర్పులో ఏడు పాఠశాలలు, 4 హాస్టళ్లకు 163 ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేత
- రూ..4.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):**ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పన ప్రథమ ప్రాధాన్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలు, నాలుగు హాస్టళ్లకు 163 సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లను ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను మోడల్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించానని, అక్కడ అవసరమైన వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో ఏయే పాఠశాలలకు ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించామన్నారు. ప్రస్తుతం ఏడు పాఠశాలల్లో ఫ్యాన్లు, సరైన వెలుతులు లేనట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై దాతల సహకారం తీసుకుని రూ. 4.40 లక్షల సీఎస్ఆర్ నిధులు సమకూర్చామని తెలిపారు. ఈ నిధులతో 163 ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు సమకూర్చామని, విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తాము ముందుంటామని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ తోపాటు పాఠశాలలకు విద్యాసంవత్సరం ముందుగానే విద్యాకిట్లు పంపిణీ వంటి చర్యలు తీసుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు –నేడు పేరిట దోచుకున్నారని, పాఠశాలలను కనీసం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కేవలం రెండేళ్ల కాలంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచామని, కొన్ని పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు పెడుతున్నారని చెప్పారు.

ప్రభుత్వ విద్యపై నమ్మకానికి ఇది నిదర్శమని, రానున్న రోజుల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో వసతులు సమకూరుస్తామని తెలిపారు

## బాపట్ల జిల్లాలో పర్యటించనున్న వైద్య బృందాలు



బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):మలేరియా రహిత బాపట్ల జిల్లా ప్రకటన నేపథ్యంలో జిల్లాలో రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందాల సందర్శనల కు సంసిద్ధత కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి వి నాగార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఒక్క మలేరియా జ్వర కేసు కూడా నమోదుకానందున బాపట్ల జిల్లాను మలేరియా రహిత జిల్లాగా ప్రకటించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసి ప్రతిపాదనలను రూపొందించిన మీదట బాపట్ల జిల్లాలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఈనెల మూడో తారీకు నుంచి ఏడో తారీఖు వరకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ తనిఖీ బృందాలు బాపట్ల జిల్లాను సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని నిర్దేశిత లక్ష్యాల గణాంకాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న సబ్ ఆఫీసర్లను జిల్లా మలేరియా అధికారి వి నాగార్జునరావు ఆదేశించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ ఆదేశాలతో బాపట్ల జిల్లా సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశం స్థానిక మలేరియా కార్యాలయంలో నిర్వహించారు .క్షేత్రస్థాయిలో మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లేబరోటరీ లో గత ఐదుసంవత్సరాల నుంచి అన్ని రకాల మలేరియా రికార్డులను తనిఖీల కోసం అందుబాటులో ఉంచాలని ఆయన అన్నారు.

అదే విధంగా తమ తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లేబరోటరీ లలో రికార్డులను ముందస్తు తనిఖీలు చేసి టీం సందర్శన నాటికి అంతా సిద్ధపరుచుకోవాలని సూచించారు.

ముఖ్యంగా ప్యాసివ్ రిజిస్టర్, ఎం.ఎఫ్ 8 రిజిస్టర్, పాజిటివ్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్,క్రాస్ చెక్ రిజిస్టర్, మొదలగు రిజిస్టర్ లను వైద్యాధికారి సమక్షంలో తనిఖీ చేసి లోటుపాట్లను వైద్యాధికారి వారి దృష్టికి తీసుకువెళ్లి సరి చేయాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయి ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ ల నుంచి బుధవారం శనివారం వచ్చే స్లైడ్ ల వివరాలు ఎం ఎఫ్2 రిజిస్టర్ తో ల్యాబ్లోని ఎం ఎఫ్ 8 రిజిస్టర్ సరిపోలేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

జిల్లాలో ప్రతి పీహెచ్సీలో ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం,ఎం ఎల్ హెచ్ పి,ఆశ వర్కర్,హెల్త్ అసిస్టెంట్ దగ్గర స్లైడ్ లు ఆర్డిటి మలేరియా కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆరోగ్య కేంద్రాలలో మలేరియా గోడ ప్రతులను సిద్ధం చేయాలని అన్నారు.

టీం జిల్లాలో ఏ పీహెచ్సీకైనా హెల్త్ సబ్ సెంటర్‌కైనా సందర్శించే అవకాశం ఉందని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఇప్పటికే ఈ విషయమై డిఎంహెచ్వో ఆదేశాలతో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెలియపరచడం జరిగిందని చెప్పారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి ఖదీర్ , బాపట్ల పట్టణ సబ్ యూనిట్ అధికారి షకీల్ పట్టణ మలేరియా పర్యవేక్షకులు రాంబాబు మరియు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సబ్ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో రెండో విడత పూడికతీత పనులు పూర్తి చేయాలి

- ఇంజినీరింగ్ అధికారులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని మేజర్, మీడియం డ్రైన్లలో రెండో విడత పూడికతీత పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

ఈ ఏడాది పూడికతీత కాంట్రాక్టులో నిర్వహణ బాధ్యతను 90 రోజుల పాటు కాంట్రాక్టర్‌కే అప్పగించే నిబంధనను పొందుపరిచినందున, రెండో విడత పూడికతీత పనులను అదే కాంట్రాక్టర్‌తో వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. పనులను ప్రతి ప్రాంతంలో అసిస్టెంట్ ఇంజినీర్లు, అమెనిటీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని, లోపాలు గుర్తిస్తే సంబంధిత అధికారులపైనే బాధ్యత ఉంటుందని హెచ్చరించారు.

రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల అమలులో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

త్రాగునీటి సరఫరాకు సంబంధించి ప్రతి నెల మూడో వారంలో తప్పనిసరిగా వాటర్ మీటర్ రీడింగ్స్ నమోదు చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో నీటి సరఫరా సమయంలో పది నీటి నమూనాలు సేకరించి సీఎంఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీ సు కుం టా మ ని హెచ్చరించారు.

నగరంలో గుర్తించిన ప్రాంతాల్లో డివైడర్ ప్లాంటేషన్ చేపట్టాలని, 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు పిన్‌పాయింట్ షెడ్యూల్ సిద్ధం చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న జీటీఎస్‌ల పురోగతిపై ప్రతిరోజూ నివేదిక సమర్పించాలని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో ఎస్ఈ సుందరామిరెడ్డి, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విష్ణు, వేణుగోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా చేపట్టాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక విభాగాల అధికారులతో కలిసి గత ఆరు నెలల నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు, చిన్నారుల భద్రత, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలను ఈ–సాక్ష్య (e-Sakshya) యాప్‌లో నమోదు చేయడంతో పాటు సాంకేతిక ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి సంబంధిత కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచడం, విజిబుల్ పోలీసింగ్, గ్రామ సందర్శనలు, వాహనాల తనిఖీలు, నేరాల నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

డయల్–112 అత్యవసర కాల్స్‌కు పట్టణ ప్రాంతాల్లో 10 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో స్పందించాలని, రాత్రి గస్తీని పటిష్టం చేసి అనుమానాస్పద వ్యక్తులను లైవ్ స్కానర్ ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, గంజాయి కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, కోర్టు కేసుల పర్యవేక్షణ, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ, హైవే పెట్రోలింగ్, రోడ్డు భద్రత చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సమావేశం అనంతరం గత ఆరు నెలల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన క్రైమ్ ఎస్పీ (ఎన్సీ) సుప్రజ, సౌత్ డీఎస్పీ జి. పూర్ణచంద్రరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్, కోర్టు, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణతో పాటు జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, శ్రీ భ్రమర గ్రూప్స్ ఎండీ శ్రీ గళ్ళా రామచంద్రరావు బుధవారం శ్రీశైలం మహాక్షేత్రాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** మండల గ్రామమైన అంగలకుదురు గ్రామ జడ్పీ హై స్కూల్ లో ఉన్న ఇంటర్ కాలేజి విద్యార్థినిలకు గురు పౌర్ణమి సందర్భంగా రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావినూతల వెంకుబాయమ్మ, కామేశ్వరమ్మ స్మారక మరియు కొత్తపల్లి భవ్యశ్రీ మెమోరియల్ మరియు రోహిణి హాస్పిటల్, గంగానమ్మ పేట, తెనాలి వారి సహకారం తో 65 మంది ఇంటర్ విద్యార్థినులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా అమర్తలూరు మాజీ zptc, రోహిణి హాస్పిటల్ డాక్టర్స్ చందోలు పృథ్వీలత, యామినీ దివ్య, డాక్టర్ మధు బాబు, డాక్టర్ వినీల్, మరియు రావినూతల ఫౌండేషన్ సభ్యులు ప్రకాష్, అన్నపూర్ణ, లక్ష్మి, అనిరుద్, ఆరాధ్య, కొత్తపల్లి ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మార్కెట్ రేటు కన్నా తక్కువ ధర లో మంచి యూనిఫామ్ అందించిన అంగలకుదురు గ్రామానికి చెందిన వస్త్రవ్యాపారి వెంకటేశ్వర క్లోత్స్ అధినేత వెంకటేశ్వర్లు ఇవ్వటం సంతోషమని వారు తెలియజేశారు. అదేవిధంగా రావినూతల ఫౌండేషన్ వారు చేస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగాఉందని ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వ కాలేజీల్లో నిర్వహించటం అభినందనీయమని వారు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలను సాగు చేయాలి



- మినుము, పెసర పంటలనే సాగు చేసుకోవాలి

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రస్తుత వర్షాభవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రైతులకు తెలియపరిచారు. కాకుమాను మండలంలోని బోడిపాలెం , కోతివానిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎ ఓ సుధాకర్ మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి పంట వేయకుండా తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్కరైతు సేవా కేంద్రంలో ఉన్నాయన్నారు . మినుము పంటకు పసల బీమా యోజన క్రింద ఎకరాకు 200/- కట్టుకోవచ్చుని రైతులు తెలియజేశారు. ఈ అవకాశం జూలై 31వ తేదీ వరకు ఉందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## రోగులకు చెప్పుల పంపిణీ



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ అంగవైకల్యమున్న కుష్టు రోగులకు మైక్రో సెల్యులర్ రబ్బర్ తో తయారు చేసిన చెప్పులను పంపిణీ చేశారు

ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ వి. సోమ్లు నాయక్ , జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాదిక్ ,బాపట్ల జిల్లాలోని డిప్యూటీ పారా మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి కారణంగా పాదాలకు అంగ వైకల్యం ఏర్పడిన వారికి నడకలో ఇబ్బందులు తగ్గించేందుకు, పాదాలను రక్షించేందుకు ఈ ప్రత్యేక చెప్పులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## శ్రీ లలితా పీఠంలో ప్రత్యేక పూజలు చేసిన బీజేపీ మాధవ్, మంత్రి సత్యకుమార్



**విశాఖపట్నం, (జర్నలిస్ట్ ఫైల్):** గురుపూర్ణిమ సందర్భంగా విశాఖపట్నంలోని శ్రీ లలితా పీఠాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం సందర్శించారు. శ్రీ లలితా త్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్మాత శ్రీ లలితా త్రిపురసుందరి అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ప్రసరించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు, ఆనందాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

పవిత్ర గురుపూర్ణిమ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జ్ఞానాన్ని ప్రసాదించి ధర్మమార్గాన్ని చూపించే గురువుల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. దైవానుగ్రహంతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## డీఎస్సీపై లోకేశ్ సవాల్‌ను స్పందించే దమ్ముందా జగన్ ?



- వైఎస్సార్ సీపీ పుట్టుకే అబద్ధం
- ఉద్యోగాలు పొందిన టీచర్ల జీవితాలతో చెలగాటం
- మద్యం, గుట్కా మాఫియాకు కేరాఫ్ సైకో వైసీపీ
- వైసీపీని భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో సైకో పార్టీ మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తోందని, వైసీపీ పుట్టుకే అబద్ధమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా అమలు చేయలేని జగన్, గుట్కాబ్యాచ్ తో ఆరోపణలు చేయడం దారుణమన్నారు. పరదర్శకంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందిన వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తినేస్తే ఏవిధంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైయస్సార్సీపి పుట్టకే ఒక అబద్ధమని విమర్శించారు. ఇసుక మద్యం అక్రమ దందా కొనసాగిస్తూ సైకోలను వాళ్ళింటిలుగా నియమించుకున్నారని విమర్శించారు. ఐదేళ్లలో డీఎస్సీ గురించి పట్టించుకోవడం వైసీపీకి చేతకాకపోతే అధికారం చేపట్టిన కేవలం 148 రోజుల్లోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 13 వేలకుపైగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేసి చరిత్ర సృష్టించారన్నారు. డీఎస్సీ అంటేనే తెలుగుదేశం పార్టీ అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల్లో 80 శాతం మంది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే ఉద్యోగాలు సాధించారని చెప్పారు. డీఎస్సీపై అడ్డగోలు ఆరోపణలు చేస్తోన్న వైసీపీకి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సవాల్ కు స్పందించే దమ్ములేదా అని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ పెద్దపెద్ద కంపెనీలను రాష్ట్రానికి తెప్పించి ప్రైవేటు ఉద్యోగాలతోపాటు ప్రభుత్వపరంగా నియామకాలు చేపడుతున్నారని తెలిపారు. అధికారంలో ఉండగా కారుణ్య నియమాకాల పోస్టులు సైతం అమ్ముకున్న నీచ చరిత్ర వైసీపీదని విమర్శించారు. వైసీపీ తరపున డీఎస్సీపై కోర్టుకు వెళ్లిన లాయర్లు సైతం క్షమాపణలు చెప్పి బయటకు వచ్చారని గుర్తు చేశారు. డీఎస్సీపై రాష్ట్రంలో గందరగోళం సృష్టించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని వైసీపీకి హితవు పలికారు. ఒకవైపు డ్రగ్ మాఫియా మరోవైపు అపహరణ వంటి నాయకులను పక్కన పెట్టుకున్న జగన్ ది సైకో పార్టీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు ఒక వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉంటే అతని లారీ తీసుకొచ్చి ఇష్టానురీతిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని తెలిపారు. అధికారం కోల్పోయాక కూడా నిస్సిగ్గుగా అదే తీరుగా ఉన్నారని విమర్శించారు. గతంలో ఎవరైతే అపహరణ కేసులో ఉన్నారో వారే డ్రగ్ కేసుల్లోనూ ఉన్నారని తెలిపారు. పార్టీ ఆఫీసులు, ప్రతిపక్ష నాయకుల ఇళ్ల మీద దాడులు చేసిన వారే విద్యార్థి నాయకులుగా వైసీపీలో చలామణి అవుతున్నారన్నారు. వైసీపీని భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం



- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి కొనసాగుతుంది: మన్నం శ్రీనివాస్

**దొనకొండ (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో దొనకొండ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ పాల్గొని మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘం వివిధ స్థాయిల్లో కృషి చేస్తోందని వివరించారు. సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ఉపాధ్యాయులకు వివరించి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ రెహమాన్, సంఘం నాయకులు మండ్ల శ్రీనివాసులు, బాల గురువులు, త్రిపురాంజనేయులు, సానె వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి అచ్చెన్నాయుడు

- నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత నష్టపెట్టొద్దు
- పొగాకు రైతులకు కేజీకి రూ.20 సాయం.. 94 మిలియన్ కేజీల కొనుగోలుకు చర్యలట
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.188 కోట్లతో రైతులకు అండగా నిలుస్తున్నాం
- రైతులకు ఉపయోగపడే నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వాగతిస్తాం.. జగన్ రైతులకు మంచి చేసే మాటలు మాట్లాడాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మిత్రపక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు.

పొగాకు రైతులను గతంలోనూ.. ఇప్పుడూ.. సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2014-15లో తొలిసారిగా ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు కేజీకి రూ. 20 చొప్పున ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 11 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని గుర్తించి గతంలో హెచ్‌డీ బర్లీ పొగాకును 25 మిలియన్ కేజీల మేర రూ. 270 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని మంత్రి తెలిపారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, బ్రెజిల్, టాంజానియా వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు పొగాకు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అచ్చెన్నాయుడు వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, మరోవైపు పొగాకు వ్యాపారులు, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల నుంచి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలీకృతమైందని చెప్పారు.

ఎన్ని ఆర్థికపరమైన ఒత్తిళ్లు, ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రాన్ని ఒప్పించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పొగాకు రైతులకు కేజీకి రూ. 20 చొప్పున సాయం అందించేలా చర్యలు చేపట్టాం. 94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు రూ. 188 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం చేశాం. అతి కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎఫ్‌సీవీ పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి టొబాకో బోర్డు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ రైతుల సమస్యలను సమీక్షిస్తూ, ప్రత్యేకంగా దృష్టి సారించి తగిన ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ, కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే రైతులకు రూ. 188 కోట్ల సాయం అందించే స్థాయికి చేరుకున్నామని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే జగన్‌మోహన్ రెడ్డికి ఇవేవీ కనిపించడం లేదా? అని మంత్రి ప్రశ్నించారు. నెగిటివ్ స్టేట్‌మెంట్ల ద్వారా మార్కెట్‌ను ప్రభావితం చేసి, రైతుల్లో ఆందోళన పెంచేలా వ్యవహరించడం వల్ల రైతులకే నష్టం జరుగుతుందని అన్నారు. తన వ్యాఖ్యల వల్ల రైతులు మరింత డిస్ట్రెస్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, కనీసం ఆ విషయమైనా జగన్‌మోహన్ రెడ్డి ఆలోచించాలని సూచించారు.

## మచిలీపట్నం-బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించండి

- బందరు పోర్టు, మంగినపూడి బీచ్ సహా పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలవండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందించిన మంత్రి కొల్లు రవీంద్ర



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధికి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలిచే మచిలీపట్నం-బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మచిలీపట్నం పోర్టు, మంగినపూడి బీచ్‌కు రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతాయి. ప్రధానంగా మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా వచ్చే ఇండస్ట్రియల్ కారిడార్స్, లాజిస్టిక్స్ పార్క్స్, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ కు సానుకూల వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో కృష్ణా జిల్లాలోని బందరు పోర్టు నుండి మంగినపూడి బీచ్ మీదుగా బంటుమిల్లి వరకు జాతీయ రహదారి 216కు అనుసంధానించాలని విన్నవించారు. ఈ రోడ్డు మార్గం పూర్తైతే.. అంతరాయం లేని కనెక్టివిటీ లభిస్తుంది. ఎంతో వ్యూహాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతిపాదిత రోడ్డు మార్గం మొత్తం ప్రభుత్వ భూమి గుండా వెళుతుండడంతో భూసేకరణ సమస్యలు లేకుండా కొత్త రహదారి నిర్మాణం చేయడానికి ఆస్కారం ఉంది. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ జాతీయ మరియు అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారబోతోంది. ఈ రోడ్డు పూర్తైతే.. పోర్ట్ ద్వారా ఎగుమతి దిగుమతులు, కంటైనర్ ట్రాఫిక్, భారీ వాణిజ్య వాహనాలు మరియు లాజిస్టిక్స్ కార్యకలాపాల కదలికలకు సులువు అవుతుంది.

ప్రతిపాదిత రోడ్డు మచిలీపట్నం ప్రాంతంలో రాబోయే ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కులు, మీవీజు క్లస్టర్‌లు, మత్స్య మౌలిక సదుపాయాలు మరియు అనుబంధ వాణిజ్య సంస్థలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందించగలుగుతుంది. తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువులు రవాణాను సులభతరం చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తైతే కృష్ణా జిల్లా మరియు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుంది. లక్షలాది మంది పర్యాటకులను ఆకర్షించే మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం మెరుగవుతుంది. తద్వారా పర్యాటకం పెరిగి.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆతిథ్యం, వినోదం మరియు ఇతర పర్యాటక కార్యకలాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధిని, ఉద్యోగ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలిచే ఈ రోడ్డు మార్గానికి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేసి పూర్తి చేయాలని విన్నవించారు.

## ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కోట శ్రీనివాసుకు ఘన సన్మానం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** విశదలలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకాడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాసు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభ ఆత్మీయ వాతావరణంలో జరిగింది. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొని కోట శ్రీనివాసు విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ, కోట శ్రీనివాసు క్రమశిక్షణ, అంకితభావం, సమర్థ నాయకత్వంతో సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి, విద్యా వాతావరణ బలోపేతంలో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో కళాశాల విద్యా, పరిపాలనా రంగాల్లో అనేక విజయాలు నమోదు చేసుకుందని, విద్యార్థులు, అధ్యాపకులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చైర్మన్ డా. ఆలపాటి రవీంద్ర, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు మాట్లాడుతూ, కోట శ్రీనివాసు సేవలు సంస్థ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అనంతరం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కిట్స్ ప్రిన్సిపాల్ డా. బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీహరి, ఏఓ సీతారామయ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో పాటు మానవతా సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొని కోట శ్రీనివాసుకు శుభాకాంక్షలు తెలిపారు.

# సంక్షేమం-అభివృద్ధితో ప్రతి కుటుంబానికి భరోసా : నక్కా ఆనంద్ బాబు

- చిన్నపులివర్రులో ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన



**కొల్లూరు, (జర్నలిస్ట్ ఫైల్):** "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం మూడో రోజు కొల్లూరు మండలంలోని చిన్నపులివర్రు గ్రామంలో ఉత్సాహంగా జరిగింది. వేమూరు శాసనసభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకుని వాటిని MyTDPApp ద్వారా నమోదు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపులివర్రు గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఎన్టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రతి కుటుంబ వివరాలను వీఎణూ-ాజూజూలో నమోదు చేయాలని కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్--యూనిట్--బూత్ ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

1,881 మంది జనాభా, 646 కుటుంబాలు ఉన్న చిన్నపులివర్రు గ్రామానికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.84 కోట్ల విలువైన ప్రయోజనాలు అందించినట్లు తెలిపారు. తల్లికి వందనం కింద 183 మంది విద్యార్థులకు రూ. 23.79 లక్షలు, దీపం--2 ద్వారా 452 కుటుంబాలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ కింద 353 మంది రైతులకు రూ. 44.95 లక్షలు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల రూపంలో 301 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ. 12.40 లక్షలు అందుతున్నాయని వివరించారు. గృహ నిర్మాణ పథకం కింద 72 గృహాలకు రూ. 45.13 లక్షల ప్రయోజనం, డ్వాక్రా తోడు ద్వారా 460 మంది మహిళలకు రూ. 75 లక్షల రుణ సాయం, పీఎం కిసాన్ కింద 353 మంది రైతులకు రూ. 21.18 లక్షలు, ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా 1,276 మందికి ఉచిత వైద్యం, సీఎంఆర్ఎఫ్ ద్వారా 11 మందికి రూ. 5.99 లక్షల ఆర్థిక సాయం, 34 మంది విద్యార్థులకు రూ. 8.50 లక్షల స్కాలర్‌షిప్‌లు అందినట్లు తెలిపారు.

గ్రామంలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 10 లక్షలతో పంచాయతీ భవనం, రూ. 7 లక్షలతో బరియల్ గ్రౌండ్ కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే 72 గృహాల నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. ప్రస్తుతం గ్రామంలో 2 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 1 కిలోమీటరు డ్రైనేజీ, 44 హ్యాండ్ పంపులు, 141 వీధి దీపాలు, రెండు పాఠశాలలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర--విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పన, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, పోలవరం నిర్మాణ వేగవంతం, అమరావతి రాజధాని అభివృద్ధి, రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందన్నారు.

ప్రచార కార్యక్రమంలో గ్రామస్తులు రెండు రహదారుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న ఇతర సమస్యలను కూడా అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, CUB ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం.. ప్రభుత్వ శాఖల ఉమ్మడి బాధ్యత : వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్

- సమన్వయంతో సీజనల్ వ్యాధులపై ముందస్తు హెచ్చరికలు అందగానే అప్రమత్తం కావాలి
- హాస్టల్‌లో ఒక్క విద్యార్థి అనారోగ్యానికి గురైనా తక్షణం స్పందించాలి
- తాగునీరు, ఆహార నాణ్యత పై ప్రత్యేక దృష్టి అవసరం
- పాముకాటు మందులు, రేబిస్ టీకాలు అందుబాటులో ఉంచాలి
- ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సీజనల్ వ్యాధులు ముఖ్యంగా వర్షాకాలంలో మలేరియా, డెంగీ, కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల వరకు సదరు ప్రభుత్వ శాఖల మధ్య సీజనల్ వ్యాధులు నియంత్రణపై నిరంతరం సమావేశాలు, సమన్వయ చర్యలు కొనసాగుతూ ఉండాలని చెప్పారు.

అంటూ వ్యాధులు వ్యాప్తి చెందిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజారోగ్యం ఒక్క ఆరోగ్య శాఖ బాధ్యత కాదని, సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

వర్షాకాల వ్యాధుల నివారణ, నియంత్రణపై వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్--గ్రామీణాభివృద్ధి, పురపాలక, విద్య, సంక్షేమ, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులతో బుధవారం 'వర్చువల్' గా నిర్వహించిన ప్రభుత్వ భాగస్వామ్య శాఖల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

హాస్టళ్లు, పాఠశాలలు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని వీరపాండియన్ సూచించారు. హాస్టల్‌లో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన తర్వాతే సమాచారం ఇవ్వాలనే ధోరణి ఉండకూడదన్నారు. ఒక్క విద్యార్థికి జ్వరం, కడుపునొప్పి, కామెర్లు, నీరసం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. హాట్‌స్పాట్లను ముందుగానే గుర్తించేందుకు సంయుక్త తనిఖీ బృందాలు క్రమం తప్పకుండా పర్యటించాలని ఆదేశించారు.

**నీటి నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ**

తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నీటినమూనాల సేకరణ పరీక్షలు నిరంతరం జరుగుతుండాలన్నారు. ప్రతికూల ఫలితాలు వచ్చిన వెంటనే ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు.

**వండిన ఆహారమే అందించాలి**

హాస్టళ్లలో విద్యార్థులకు ఏ పూటకు ఆ పూట తాజాగా వండిన ఆహారమే అందించాలని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆహార విషబాధ ఘటనల్లో గుర్తించిన లోపాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్ని జిల్లాలకు పంపాలని ఓ అధికారి సూచించారు. ఆహార వ్యర్థాలను సక్రమంగా తొలగించకపోతే ఎలుకలు, దోమల సమస్య పెరుగుతుందని, స్థానిక సంస్థలు, వ్యవసాయ శాఖ కలిసి ఎలుకల నియంత్రణ చర్యలు చేపట్టాలని మరో అధికారి చెప్పారు. దోమల లార్వా నియంత్రణలో భాగంగా చెరువులు, ఇతర నీటి వనరుల్లో గంబూసియా చేపల పెంపకానికి అనువైన ప్రాంతాలను గుర్తించాలని మత్స్యశాఖను కార్యదర్శి ఆదేశించారు.

వీధికుక్కల నియంత్రణ, రేబిస్ నివారణకు పశుసంవర్ధక, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు కలిసి కార్యాచరణ రూపొందించాలని వీరపాండియన్ ఆదేశించారు. కుక్కల స్టెరిలైజేషన్, రేబిస్ టీకాల కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించి వారం రోజుల్లో పురోగతిని సమీక్షించాలన్నారు. పాముకాటు బాధితులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే సకాలంలో చికిత్స అందేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణ, రిఫరల్ వ్యవస్థ.. ఈ ఐదు అంశాలపై అన్ని శాఖలు ప్రధానంగా దృష్టి పెట్టాలని వీరపాండియన్ స్పష్టం చేశారు. పీహెచ్‌సీ స్థాయిలో వారానికోసారి, జిల్లా స్థాయిలో క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ తీసుకున్న నిర్ణయాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467